సాక్షి
ఒడిశా
శనివారం । 22 । మార్చి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 5,09,753లు, బంగారం 1 గ్రాముల 700 మిల్లీగ్రాములు, వెండి 21 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కాలవైశాఖి విజృంభణ

మయూర్‌భంజ్‌లో కాలవైశాఖి విజృంభించింది. ఇళ్లు ధ్వంసమయ్యాయి.

- 8లో

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హరీష్ టండన్



భువనేశ్వర్: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హరీష్ టండన్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఆమోదం తెలిపింది. ఆయన ప్రస్తుతం కోల్‌కతా హై కోర్టులో న్యాయమూర్తిగా పని చేస్తున్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆధ్వర్యంలో కొలీజియం జస్టిస్ హరీష్ టండన్‌ను సిఫార్సు చేసింది.

న్యూస్‌రీల్

13 ఇసుక ట్రాక్టర్లు సీజ్



గుణుపూర్ పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

రాయగడ: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై జిల్లాలోని గుణుపూర్ ఆదర్శ పోలీసులు కొరడా ఝులిపించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ఖనిజ, వాణిజ్య శాఖల మంత్రి బిభూతి జెన్న ఇటీవల రాయగడ జిల్లాలో పర్యటించిన సందర్భంగా సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా పోలీసు యంత్రాంగం ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న వంశధార నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 13 ట్రాక్టర్లను సీజ్ చేసి, దీనికి సంబంధించి 12 కేసులు నమోదు చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చైన్ స్నాచింగ్



సీసీటీవీ ఫుటేజీలో నిందితులు

భువనేశ్వర్: పట్టపగలు నడి రోడ్డు మీద చైన్ స్నాచింగ్ జరిగిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. ఈ మేరకు స్థానిక బొడాగొడా పోలీసు ఠాణాలో శుక్రవారం ఫిర్యాదు దాఖలైంది. నగరంలో బ్లాక్ పల్సర్ బైక్‌పై హెల్మెట్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి చైన్ తెంచుకొని పరారైనట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఘటనా స్థలంలో సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. కాగా ఘటనతో నగరంలో భయాందోళన నెలకొంది.

భారీగా గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి సరిగడ అటవీ ప్రాంతంలో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉంచిన 1,020 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిలో భాగంగా ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులను శుక్రవారం కోర్టుకు తరలించారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంబులెన్స్‌ను ఢీకొన్న ట్రక్



అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి సింద్రిమాల గ్రామం వద్ద గురువారం రాత్రి మృతదేహంతో వస్తున్న అంబులెన్స్‌ను ఓ ట్రక్ ఢీకొట్టింది. ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మల్కన్‌గిరి సమితి ఎంవీ 43 గ్రామానికి చెందిన శాంతి మండల్ అనే వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో మల్కన్‌గిరి ఆస్పత్రిలో చేరారు. ఆయన పరిస్థితి విషమించడంతో బరంపురం ఆస్పత్రికి రిఫర్ చేశారు. సోమవారం అక్కడకు తరలించగా గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తుండగా మల్కన్‌గిరి నుంచి జయపురం వస్తున్న ఓ ట్రక్ అంబులెన్స్‌ను ఢీకొట్టింది. దీంతో అంబులెన్స్‌లో ఉన్న తల్లీకొడుకులు, డ్రైవర్‌కు గాయాలయ్యా యి. ట్రక్ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి ట్రక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సభలో కాంగ్రెస్ దుమారం

- బాకాలు ఊదుతూ నిరసన తెలిపిన నాయకులు
- హోరెత్తిన సభ



స్పీకరు ఎదురుగా ఘంటానాదం, బాకా బజాయింపుతో కాంగ్రెస్ సభ్యుల నిరసన



నల్లని వస్త్ర ధారణతో సభ బయట ప్రభుత్వ వైఖరిని మీడియా ముందు ఎండగడుతున్న కాంగ్రెస్ సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో శుక్రవారం నాటి పరిస్థితి మరింత గందరగోళంగా మారింది. కాంగ్రెస్ సభ్యులు తగ్గేదే లేదని తెగేసి స్పీకరుని చుట్టుముట్టారు. రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న నేరాలపై కాంగ్రెస్ వైఖరిలో ఏమాత్రం తగ్గేది లేదు. ఈ విచారకర పరిస్థితులపై ప్రభుత్వం సభా కమిటీ ఏర్పాటు చేయాల్సిందేనని తొడ గొడుతున్నారు. బడ్జెటు సమావేశాల ఆరంభం నుంచి కాంగ్రెస్ సభ్యులు ఇదే పట్టుతో ఏమాత్రం సడలకుండా నిలదీస్తున్నారు. సభలో ఉద్యమానికి సారథిగా పేరొందిన తారా ప్రసాద్ బాహిణీపతిని సభ నుంచి వారం రోజుల పాటు సస్పెన్షన్ ఉత్తర్వుల్ని స్పీకరు జారీ చేయడంతో పరిస్థితి మరింత బిగుసుకుంది. నిత్యం నిరసనలతో సభా ప్రాంగణం హోరెత్తిపోతోంది. నిరసనకారుల వ్యతిరేకంగా చర్యలు చేపట్టలేని దయనీయ పరిస్థితుల్లో ప్రభుత్వ దక్షత ఊగిసలాడుతోంది. రోజుకో అవతారంతో కాంగ్రెస్ సభ్యులు స్పీకరుని చుట్టుముట్టి సభలో గలాటా రేపుతున్నారు. నిస్సహాయ పరిస్థితుల్లో స్పీకరు సభని అంచెలంచెలుగా వాయిదా వేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.

శుక్రవారం మరో విభిన్న రూపంలో కాంగ్రెస్ సభ్యులు సభలో ప్రత్యక్షం అయ్యారు. అంతా నల్లని దుస్తులు ధరించి తలకు నల్లని పాగా చుట్టి వింత రూపంలో తారస పడ్డారు. సభా కార్యక్రమాలు మొదలు కావడంతో తలో వాద్యంతో సభా ప్రాంగణాన్ని మనోరంజక వేదికగా మలిచారు. ఘంటానాదం, వేణు గానం, బాకా బజాయింపుతో సభ ప్రాంగణం హోరెత్తి పోయింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో సభా కార్యకలాపాల్ని స్పీకరు వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ నిరసన కారణంగా శాసన సభలో ప్రశ్నోత్తరాలకు పూర్తిగా గండి పడింది. సభని ఉదయం 11.30 గంటల వరకు స్పీకరు సురమా పాఢి వాయిదా వేయడంతో ఈ విచారకర పరిస్థితి నిరవధికంగా కొనసాగుతుంది. వేణు గానం, బాకా బజాయింపు, ఘంటానాదం చేస్తు కాంగ్రెస్ సభ్యులు సభలో గందరగోళం సృష్టించారు. మహిళలపై నేరాలను నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని చేసిన నినాదాలతో సభని మారు మోగించారు.

మరోవైపు సభలో తమను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ (బీజేడీ) సభ్యులు కూడా సభ నుంచి వైదొలిగారు. బీజేడీ సభ్యులు సభలోని స్పీకరు పీఠం ముంగిటకు చేరి ప్రభుత్వ వ్యతిరేకంగా నినాదాలు చేస్తు స్పీకరుకు చేతులు ఊపుతూ తమ అసంతృప్తిని వ్యక్తం చేసి బయటకు వెళ్లిపోయారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కలిగిన ప్రజా సమస్యలపై గళం కదిపేందుకు వీలు లేకుండా అధికార పక్షం అన్యాయానికి పాల్పడుతోందని ఆరోపించారు. చర్చలో పాల్గొనడానికి తమకు తగిన అవకాశం ఇవ్వడం లేదని వారు ఆరోపించారు.

దేవమాలి నాడు–నేడు



గతంలో దేవమాలి పర్వతం పై చెత్త



ప్రస్తుతం పరిశుభ్రంగా దేవమాలి పర్వతం



చెత్తని భారీ ఎత్తున తరలిస్తున్న సినిమా సిబ్బంది

కొరాపుట్: నెల రోజుల కిందట ఎక్కడ చూసినా చెత్త చెదారంతో ఉన్న దేవమాలి పర్వతం నేడు పరిశుభ్రంగా కనిపిస్తోంది. అక్కడ పరిసరాలు పరిరక్షించే నాథుడు లేక పోవడంతో సందర్శకులు వదిలేసిన చెత్త నిండి ఉండేది. కానీ ప్రఖ్యాత దర్శకుడు రాజమౌళి రాకతో ప్రపంచం దృష్టి దేవమాలిపై పడింది. రాజమౌళి ఆదేశాలతో సినిమా యూనిట్ ఈ ప్రాంతాన్ని పరిశుభ్రం చేసింది. ఇకనైనా పర్యాటకులు ఇక్కడ చెత్త వేయరాదని రాజమౌళి చేసిన విజ్ఞప్తి పాటించాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు దుర్మరణం



ప్రమాద స్థలం వద్ద మృతురాలు లలిత గౌడ

జయపురం: ఒకే చోట మూడు బైక్‌లు ప్రమాదానికి గురి కాగా ఒక మహిళ మృతి చెందగా ఆమె కుమారునితో పాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన మహిళ జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి పల్లి గ్రామం లలిత గౌఢ (60) కాగా గాయపడిన వారిలో ఆమె కుమారుడు హిరణ్య గౌఢ(27), బొరిగుమ్మ పోలీసు స్టేషన్ పరిధిలోగల ఖెందుగుడ గ్రామ దంపతులు ప్రభాకర పాత్రో (45) అతడి భార్య సేవిక పాత్రో, అలాగనే జయపురం సమితి మూలసార గ్రామం రవీంద్ర తంతి(24) ఉన్నట్లు జయపురం సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ శుక్రవారం వెల్లడించారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హిరణ్య గౌడను కొరాపుట్ సహీద్ లక్ష్మణ నాయక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించామని, మిగతా ముగ్గురిని జయపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్పినట్లు వెల్లడించారు. పోలీసు అధికారి వివరణ ప్రకారం.. లలిత ఆమె కుమారుడు హిరణ్యలు బైక్‌పై బొరిగుమ్మ వెళ్తుండగా ప్రభాకర పాత్రో దంపతులు బైక్‌పై జయపురం వస్తున్నారు. 26 వ జాతీయ రహదారి రొండాపల్లి గ్రామం రేడియో స్టేషన్ కూడలి వద్ద ఆ రెండు బైక్‌లు ముఖాముఖి ఢీకొన్నాయి. అదే సమయంలో జయపురం సమితి మూలసర గ్రామం నుంచి రవీంద్ర మరో బైక్‌పై వస్తుండగా అదే స్థలంలో అతడి బైక్ కూడా ప్రమాదానికి గురైంది. అతడు చిన్న దెబ్బలతో బయట పడ్డాడు. ప్రమాద సమాచారం అందిన వెంటనే అంబాగుడ పోలీసు పటి పోలీసు అధికారి మనువ బిడిక పోలీసులతో సంఘటన ప్రాంతానికి చేరుకుని సహాయ కార్యక్రమం చేపట్టారు. స్థానికుల సహకారంతో గాయపడిన వారందరినీ ఆస్పత్రికి పంపారు. సమాచారం అందుకున్న సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రదాన్ అక్కడకు చేరుకున్నారు. చికిత్స చేస్తున్న సమయంలో లలిత మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. హిరణ్య గౌడ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం అతడిని కొరాపుట్ తరలించినట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కొరాపుట్ ఎంపీ భేటీ



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉల్క శుక్రవారం భేటీ అయ్యారు. తనను రాష్ట్రపతిగా ఎంపిక చేసిన పలువురికి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానించి అల్పాహారం ఏర్పాటు చేయించారు. అందులో భాగంగా ఎంపీ ఉల్క కూడా వెళ్లారు.

బీమా పరిహారం అందజేత



చెక్కు అందజేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలో కల్యాణ సింగుపూర్ సమితి సెరిగుమ్మ పంచాయతీలోని కొనగా గ్రామానికి చెందిన నాయికొ మండంగి కుటుంబానికి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకంలో భాగంగా రూ.2 లక్షల బీమా పరిహారం స్థానిక ఉత్కళ గ్రామీణ బ్యాంకు అధికారి శుక్రవారం అందజేశారు. నాయకొ మడంగి ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆయన చేసిన బీమా నగదును ఇంటికి వెళ్లి బాధితుడి భార్య కుడుంజికి అందించారు.

కొరియా ప్రాంతంలో ఆక్రమణలు తగవు



కొరియా ప్రాంతంలో సరిహద్దు రాళ్ల వద్ద సీపీఎం నాయకులు

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాలో ఆక్రమణలు తగవని సీపీఎం నాయకులు హెచ్చరించారు. శుక్రవారం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొఠియా గ్రామ పంచాయతీ ఎగువ శెంబి ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మన్యం జిల్లా సాలూరు మండల సీపీఎం కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు పర్యటించారు. ఒడిశా ప్రభుత్వం తరఫున గనుల తవ్వకాల కోసం రాళ్లు పాతారని గుర్తు చేశారు. ఈ విషయం పై ఇటు ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ మంత్రి సంధ్యారాణి కూడా మౌనం వహిస్తున్నారన్నారు. వివాదాస్పద ఆ ప్రాంతం లో సుప్రీం కోర్టు స్టేటస్ కో ఆదేశాలు ఉన్నాయన్నారు. అంతేకాక ఐదో షెడ్యూల్ ప్రాంతం కనుక గిరిజనులకే సర్వ హక్కులు ఉన్నాయన్నారు. ఇక్కడ సరిహద్దు రాళ్లు వేసి గనులు తవ్వకాల కోసం ప్రారంభ పూజలు చేసిన చిత్రాలు శ్రీనివాసరావు విడుదల చేశారు.

చెన్నై చేరిన బీజేడీ, కాంగ్రెస్ నాయకులు



చెన్నై విమానాశ్రయంలో రాష్ట్ర బీజేడీ, కాంగ్రెస్ నాయకులు

భువనేశ్వర్: ప్రతిపాదిత పునర్విభజనపై చెన్నైలో జరగనున్న సమావేశానికి హాజరయ్యేందుకు రాష్ట్రం నుంచి బిజూ జనతా దళ్, కాంగ్రెస్ నాయకులు బయల్దేరారు. శుక్రవారం సాయంత్రం వీరంతా చెన్నై చేరారు. బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ నిర్ణయం మేరకు ఆ పార్టీకి చెందిన మాజీ పార్లమెంటు సభ్యుడు అమర్ పట్నాయక్, మాజీ ఎమ్మెల్యే సంజయ్ దాస్ బర్మ ప్రాతినిధ్యం వహించారు. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఈ సమావేశానికి హాజరవుతున్నారు. పునర్విభజన సాహసోపేతమైన రాజకీయ చర్యలో భాగంగా రాజకీయ శిబిరాల్లో చర్చ సాగుతుంది. భారతీయ జనతా పార్టీ వ్యతిరేక దళాలు శనివారం చెన్నైలో జరగనున్న డీలిమిటేషన్‌పై కీలకమైన సమావేశానికి హాజరు అవుతున్నాయి. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం బీజేడీ తన వైఖరిని ఈ సమావేశంలో వ్యక్తీకరిస్తుందని ఆ పార్టీ ప్రతినిధులు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో కేవలం జనాభా గణాంకాల ఆధారంగా ఉంటే రాష్ట్రంపై పునర్విభజన ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని ఈ ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో చర్చ ఆధారంగా రాష్ట్రంపై పునర్విభజన ప్రభావం స్పష్టం కానుందని సంజయ్ దాస్ బర్మ తెలిపారు. తదనంతరం బీజేడీ వైఖరి స్పష్టం అవుతుందన్నారు. ఒడిశా, పంజాబ్, బెంగాల్ సహా ఎనిమిది రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన నాయకత్వ ప్రతినిధి బృందం తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆతిథ్యం ఇచ్చే కార్యక్రమంలో సమావేశమవుతుందని సమాచారం. ఈ ఉన్నత స్థాయి సమావేశం వివాదాస్పద పునర్విభజనతో ప్రాంతీయ సమస్యలను చర్చిస్తుందని భావిస్తున్నారు.

అడవిలో చిన్నారి మృతదేహం లభ్యం



చిన్నారి (ఫైల్)



మృతదేహం వద్ద పోలీసులు

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి గగుడిమాల్ గ్రామ సమీపంలో గల ఒక అటవీ ప్రాంతంలో ఒక చిన్నారి మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం కొరాపుట్ తరలించారు. కళ్యాణసింగుపూర్ ఐఐసీ నీలకంఠ బెహర తెలియజేసిన వివరాల ప్రకారం... ఈ నెల 11 వ తేదీన గగుడిమాల్ గ్రామానికి చెందిన అజిత్ నాగవంశ్ అనే వ్యక్తికి చెందిన ఏడాదిన్నర కొడుకు తప్పిపోయాడు. ఎంత వెతికినా జాడ లేకపోవడంతో కళ్యాణసింగుపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శుక్రవారం నాడు గగుడిమాల్ గ్రామానికి చెందిన కొందరు బహిర్భూమికని అటువైపుగా వెళుతున్న సమయంలో పొదల నుంచి దుర్వాసన రావడం గమనించి అక్కడకు వెళ్లి చూశారు. ఒక మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అజిత్ నాగవంశ్‌కు సమాచారం అందించారు. మృతదేహానికి ఉన్న చొక్కాను బట్టి అది తన కొడుకు మృతదేహమేనని అజిత్ స్పష్టం చేశాడు. అయితే గ్రామానికి ఇంత దూరంలో ఏడాదిన్నర చిన్నారి ఎలా వచ్చింది. ఇది హత్యా లేక మరేమైనా కారణం ఉంటుందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కొరాపుట్ కోర్టులో తేనెటీగల దాడి



ద్విచక్ర వాహనం పై వెళ్లిపోతున్న న్యాయవాది



తేనెటీగల దాడితో ప్రాణ భయంతో పరుగులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలోని కోర్టుల సముదాయంలో శుక్రవారం మధ్యాహ్నం తేనెటీగలు దాడి చేశాయి. మధ్యాహ్నం కోర్టు ప్రాంతం న్యాయవాదులు, కక్షి దారులతో కిటికిటలాడుతోంది. ఇదే సమయంలో ఒక ఆకతాయి అక్కడ ఉన్న చెట్టు మీద ఉన్న తెనె పట్టు పై రాయి విసిరాడు. దీంతో తేనెటీగలు ఒక్కసారిగా విరుచుకుపడ్డాయి. నలుగురు బాధితులు ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం



పర్లాకిమిడి దేవగిరి రేంజ్ నుంచి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎఫ్‌ఓ సన్నీ ఖోఖర్



ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా పట్టణంలో విద్యార్థుల ర్యాలీ

పర్లాకిమిడి: ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా జైల్ రోడ్డులోని దేవగిరి రేంజ్ కార్యాలయం నుంచి ఒక చైతన్య ర్యాలీని డీఎఫ్‌ఓ సన్నీ ఖోఖర్ ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ మీదుగా హైస్కూల్, రాజవీధి మీదుగా ఫారెస్టు కార్యాలయం వరకూ సాగింది. అనంతరం జిల్లా అటవీ డివిజనల్ శాఖ కార్యాలయంలో ఒక సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా పాల్గొని మాట్లాడారు. గజపతి జిల్లాలో అటవీ ప్రాంతంలో వన్యప్రాణాలు రక్షించాలని, అటవీ సంపదను మనం కాపాడుకోవాలని ఎస్పీ జె.ఎస్.పండా సూచించారు. డీఎఫ్‌ఓ సన్నీ ఖోఖర్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఏసీఎఫ్ అరుణ్ కుమార్ సాహు, ఏడీఎఫ్ షైన్‌శ్రీ దాస్, రేంజర్ బ్రహ్మనంద సాహు, సెంచూరియన్ డీన్, దేవగిరి రేంజ్ ఫారెస్టర్ పి.వెంకటరమణ, ఫారెస్టుగార్డు ప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటితేనే భవిష్యత్

జయపురం: మొక్కలు నాటి చెట్లు పెంచక పోతే దేశ పౌరులు ఆక్సిజన్ సిలిండర్లు పట్టుకుని తిరగాల్సి వస్తుందని పలువురు వక్తలు అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జయపురం అటవీ డివిజన్ విభాగం వారు జయపురం పూల్‌బెడ ప్రాంతంలోని ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ కేంద్ర సభా గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు పర్యావరణ ప్రేమికులు, రీసెర్చ్ స్కాలర్స్ సైంటిస్టులు పాల్గొన్నారు. సమావేశంలో జయపురం అటవీ డివిజన్ అధికారి ప్రతాప్ కుమార్ బెహరా అంతర్జాతీయ అటవీ దినోత్సవం ప్రాధాన్యతపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత పీకే మిత్ర మాట్లాడుతూ దేశంలో పచ్చదనాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వృథాగా ఉన్న భూములను పచ్చగా మార్చాలన్నారు. 2025 నుంచి 2050 లోగా జీరో కార్బన్ డై ఆక్సైడ్ దేశంగా మార్చాలన్న కలను సాకారం చేసేందుకు ఉద్యమించాలన్నారు. అటవీ విభాగ అధికారి పీకే మిశ్రా అధ్యక్షతన జరిగిన ప్రపంచ అటవీ దినోత్సవంలో ప్రముఖ పర్యావరణవేత్త, స్థానిక విక్రమదేవ్ యూనివర్సిటీ జియాలజీ విభాగ ప్రొఫెసర్ ఉదయ కుమార్ దాస్, డీఎఫ్‌ఓ ప్రతాప్ కుమార్ బెహరా, తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ అటవీ దినోత్సం సభలో పాల్గొన్న విద్యార్థులు, అటవీ సిబ్బంది



అంతర్జాతీయ అటవీ దినోత్సవంలో ప్రసంగిస్తున్న డీఎఫ్‌ఓ ప్రతాప్ కుమార్ బెహరా



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

క్లుప్తంగా

అభివృద్ధి పనులపై సమీక్ష

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆహార సరఫరా, ప్రజా సంక్షేమ శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో సమీక్ష నిర్వహించారు. ముందుగా ఆయన జిల్లాలో పలు ప్రాంతాల్లో పర్యటించి అనంతరం ఈ సమావేశానికి హాజరయ్యారు. ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవినీతిపరులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రేషన్ కార్డు కోసం 6.8 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, అర్హులకు కార్డులు అందేలా బ్లాక్ స్థాయిలో సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి నివాసయోజన కింద అర్హుల ఎంపికకు సర్వే నిర్వహించాలన్నారు. సమావేశంలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మట్కమి, మల్కన్‌గిరి కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సమరి టంగులు, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రదన్, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేష్ చంద్ర సాబర తదితరులు పాల్గొన్నారు.

పార్జిశీల గ్రామంలో నీటి ఎద్దడి



కలెక్టర్‌కు సమస్యను చెప్పుకుంటున్న పార్జిశీల గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి పార్జిశీల గ్రామంలో మంచినీటి కొరత తలెత్తడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. తమ గ్రామానికి నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలక్టర్ ఫరూల్ పట్వారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో 30 కుటుంబాలకు చెందిన వంద మందికి పైగా నివసిస్తున్నామన్నారు. గ్రామంలో ఉన్న ఏకైక బోరింగు మరమ్మతులకు గురైందని.. దీంతో నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని వాపోయారు. సమస్యను పరిష్కరించి తమ కష్టాలు తీర్చాలని కలెక్టర్‌కు విన్నవించారు. వినతిపత్రం సమర్పించిన వారితో పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండా కూడా ఉన్నారు.

ప్రఫుల్ల కుమార్ పండాకు ఇస్రో ఐఐఆర్‌ఎస్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రఫుల్ల పండా

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ప్రఫుల్లకుమార్ పండాకు ఉత్తమ ఐఐఆర్‌ఎస్. డి.ఎల్.పి.కోఆర్డినేటరు అవార్డును ఇస్రో సంస్థ డెహరాడూన్‌లో అందుకున్నారు. ఈ అవార్డును ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎ.కె.కిరణ్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నట్టు డాక్టర్ ప్రఫుల్ల కుమార్ పండా తెలిపారు. దేశవ్యాప్తంగా 3,800 మంది ఈ అవార్డుకు దరఖాస్తు చేసుకోగా వారిలో 22 మంది కోఆర్డినేటర్లు ఎంపిక అవ్వగా చివరికి ముగ్గురు అవార్డుకు ఎంపికయ్యారు. ప్రఫుల్ల కుమార్ పండా స్పేస్ టెక్నాలజీ , జియాస్పెషల్ అప్లికేషన్‌పై ఆయన పరిశోధనకు ఈ అవార్డు లభించింది. డాక్టర్ పండా గతంలో ఇస్రోలో కొన్నేళ్లు పనిచేసి మానేశారు. ఇస్రో సంస్థ తరఫున అవార్డు పొందినందుకు సెంచూరియన్ వర్సిటీ చైర్మన్ డాక్టర్ ముక్తికాంత మిశ్రా, ఉపాధ్యక్షులు ఆచార్య డి.ఎన్.రావు, ఉపకులపతి డాక్టర్ సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రోలు అభినందనలు తెలియజేశారు.

డంపింగ్ యార్డును తరలించండి



సచేతన నాగరిక మంచ్ సభ్యులతో చర్చలు జరుపుతున్న అధికారులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలోని డంపింగ్ యార్డుని వేరే ప్రాంతానికి తరలించాలని సచేతన నాగరిక మంచ్ డిమాండ్ చేసింది. శుక్రవారం కొరాపుట్ మున్సిపాలిటీ కార్యాలయంలో మంచ్ సభ్యులతో మున్సిపల్ యంత్రాంగం చర్చలు జరిపింది. పట్టణంలోని 10వ వార్డులో అశోక్ నగర్‌లో ప్రస్తుతం డంపింగ్ యార్డు ఉంది. అందులో పట్టణంలో వ్యర్థాలతో పాటు వైద్య కళాశాల వ్యర్థాలు వేస్తున్నారు. దాంతో ఆ ప్రాంతం అంతా దుర్గంధంతో పాటు పొగలు అలుముకుంటున్నాయి. దీనిని తరలించక పోతే మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మంచ్ హెచ్చరించింది. దాంతో మున్సిపల్ చైర్మన్ లలేటిందు రంజన్ శెఠి జోక్యం చేసుకొని మంచ్ సభ్యులతో చర్చలు జరిపారు. యార్డుని వేరే చోటుకు తరలించడానికి అధికారులు అంగీకరించారు. మాజీ ఎమ్మెల్యే నిమయ్ సర్కార్, రుపక్ తురుకు తదితరులు పాల్గొన్నారు.



బల్లిచువా గ్రామంలో గాలివానకు కూలి పోయిన ఇళ్లు



మయూర్‌భంజ్ జిల్లా కదంబెడ గ్రామంలో కూలిపోయిన ఇళ్లు



మయూర్‌భంజ్ జిల్లాలో అనేక గ్రామాల్లో పడిన వడగళ్లు



మయూర్‌భంజ్ దేవ్‌పేటలో కాలవైశాఖి ప్రభావంతో కూలిపోయిన పాఠశాల

మయూర్‌భంజ్‌లో కాలవైశాఖి విజృంభణ

పర్లాకిమిడి: మయూర్‌భంజ్ జిల్లా బిశోయి బ్లాక్ కదం బెడా, బల్లిచువా, బరిపదా గ్రామ పంచాయితీలలో గురువారం సాయంత్రం కాలవైశాఖి ప్రభావంతో వడగళ్ల వాన కురిసింది. ఈ దెబ్బకు 40 నుంచి 50 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పలువురి ఇళ్లు నాశనమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల గోడలు, సిమెంటు రేకుల ఇళ్ల పైకప్పులు కూలిపోయాయి. గాలివాన, వడగళ్ల వాన గంటకు 60 కిలో మీటర్ల వేగంతో వీచినట్టు స్థానికులు చెబుతున్నారు. ఉత్తర ఒడిశాలో మయూర్‌భంజ్, ఢెంకనాల్, బాలేశ్వర్, సుందర్‌ఘడ్, సంబల్‌పూర్, జగత్సింగ్ పూర్, బర్‌ఘడ్, సోన్‌పూర్ జిల్లాలకు ఎల్లో వార్నింగ్‌ను జారీ చేశారు. 50 నుంచి 60కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని ఐఎండీ అధికారులు చెబుతున్నారు. ఈ కాలవైశాఖి రాష్ట్ర వ్యాప్తంగా 23 జిల్లాలో మరో 24 గంటలపాటు ఉంటుందని అంటున్నారు.

కృత్రిమ మేధ ఈ తరం అద్భుతం



ఐఐటీ, భువనేశ్వర్ ప్రొఫెసర్ భరతం రామ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సెంచూరియన్ వర్సిటీ ఉపకులపతి డాక్టర్ సుప్రియా పట్నాయక్.



అంతర్జాతీయ సెమినార్‌లో మెడా-2025 సావనీర్‌ను విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు



ఇంటెలిజెన్స్ టెక్నాలజీపై వివరిస్తున్న ఐఐటీ ప్రొఫెసర్ భరతం రాంకుమార్.

పర్లాకిమిడి: మనిషి మేధాశక్తిని సాంకేతికతతో రూపాంతరం చేసి కృత్రిమ మేధను సృష్టించడం ఈనాటి ప్రపంచంలో చూడగలుగుతున్నామని, ఐఐటీ, భువనేశ్వర్ ప్రొఫెసర్ భరతం రామ్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్శిటీ ఓపెన్ ఆడిటోరియంలో ప్రథమ అంతర్జాతీయ సమావేశానికి ప్రొఫెసర్ భరతం రామ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ అంతర్జాతీయ సమావేశానికి గౌరవ అతిథులుగా భువనేశ్వర్ నుంచి శిక్షా ఓ అనుసంధాన్ డీమ్డ్ వర్సిటీ అధ్యాపకులు మిహిర్ ఎన్.మహంతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆశిష్ రందజన్ దాస్, ప్రొఫెసర్ సుజాతా చక్రవర్తి, సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ సుప్రియా పట్నాయిక్, రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రోలు విచ్చేయగా సమావేశ కన్వీనరు ప్రొఫెసర్ అశోక్ మిశ్రా తన స్వాగత ప్రసంగంలో అతిథులను ఆహ్వానించారు. దేశ, అంతర్జాతీయ నిపుణులు, పరిశోధకుల నుంచి 140 థీసిస్ పేపర్లు రాగా, వాటిలో 40 ప్రెజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా మెడా- 2025, మెషీన్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్‌పై ఒక సావనీర్‌ను గౌరవ అతిథులు ఆవిష్కరించారు. కృత్రిమ మేధాశక్తితో మెషీన్ ఇంటెలిజెన్సు, డాటా సైన్స్ అనుసంధానం చేసి ఫ్యాక్టరీలు, రైల్వే కోచ్‌లు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉపయోగిస్తున్నారని ప్రొఫెసర్ భరతం రాం కుమార్ తన ప్రెజెంటేషన్‌లో పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ అంతర్జాతీయ సెమినార్ మెడా-25కు వర్చువల్ విధానంలో ప్రొఫెసర్ విన్సెంజో పియురీ (ఇటలీ), లక్కీశర్మ (జీకోన్ నెట్‌వర్క్), ప్రొఫెసర్ స్వగతం దాస్ (కోల్‌కోత్తా), నేహాశర్మ, ప్రోసెలస్టియన్ వెండీ (యు.కె.)లు హాజరయ్యారు.



అంతర్జాతీయ సెమినార్‌కు విచ్చేసిన అధ్యాపకులు, విద్యార్థులు

రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ అమలు

- మంత్రి మండలి నిర్ణయం
- 10 ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 10 శాఖల ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించింది. రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు, ఉపాధిలో గణనీయమైన నికర పురోగతికి దోహదపడే ప్రతిపాదనల పట్ల నిర్ణయాలను తీసుకున్నట్లు శాసన సభలో ప్రకటించారు.

ఆయుష్మాన్ భారత్ యోజనకు మార్గం సుగమం

భారత ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ పీఎం-జేఏవై) రాష్ట్రంలో అమలుపై ఊగిసలాడిన పరిస్థితులకు తెర పడింది. డబల్ ఇంజిన్ సర్కారు ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు మార్గం సుగమం చేసింది. మంత్రి మండలి తీసుకున్న నిర్ణయంతో ఇది సాధ్యమైంది. ఈ నిర్ణయం రాష్ట్రంలో 3.46 కోట్లకు పైగా ప్రజలకు లబ్ధి చేకూర్చుతుంది. ఏబీ పీఎం-జేఏవై అమలుతో నగదు రహిత ఆరోగ్య సంరక్షణ సేవలు అక్కరకు వస్తాయి. ఈ చర్య ఆర్థికంగా బలహీన వర్గాలకు నాణ్యమైన వైద్య చికిత్సను గణనీయంగా మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ రాష్ట్రంలో అమలు చేయడంతో మునుపటి బిజూ స్వాస్థ్య కళ్యాణ్ యోజన (బీఎస్‌కేవై) అమలు, కార్యాచరణ క్రమంగా కనుమరుగు అవుతుంది. బీఎస్‌కేవై పంథాలో రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణ విధానాలను కేంద్ర పథకంతో అనుసంధాన పరుస్తూ మునుపటి పథకాన్ని దారి మళ్లిస్తారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా అమలు చేయడానికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా మౌలిక సౌకర్యాల అభివృద్ధి ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోద ముద్ర వేసింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదించిన రాష్ట్ర రహదారి విధానం రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. ఈ విధానం కింద గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల రహదారి అనుసంధానం నెట్‌వర్క్ మెరుగుపరచడం లక్ష్యంగా పేర్కొన్నారు. నిరంతర రవాణా సౌర్యాలతో ఆర్థిక అభివృద్ధిని పెంచడంపై దృష్టి కేంద్రీకృతం అవుతుంది. ఉద్యోగంలో ఉండగా అకాల మరణానికి గురి అయిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబీకుల్లో ఒకరికి కారుణ్య కోటా కింద ఉద్యోగం కల్పించే విధానం సంస్కరణకు మంత్రి వర్గం అంగీకరించింది.

వీహెచ్‌పీ పటిష్టతకు కృషి



వీహెచ్‌పీ సమావేశంలో హరిశంకర్‌జీ తదితరులు

జయపురం: విశ్వహిందూ పరిషత్ పటిష్టతకు అందరూ కృషి చేయాలని వక్తలు కోరు. వీహెచ్‌పీ పరిషత్ పశ్చిమ ప్రాంత సమావేశాన్ని స్థానిక శారదా విహార ప్రాంతంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో మఠ మందిర, విద్యాలయ ప్రముఖులు హరిశంకర జీ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. విశ్వ హిందూ పరిషత్ కార్యకలాపాలపై పశ్చిమ ప్రాంత కార్యదర్శి భక్త చరణ దాస్ వివరించారు. వీహెచ్‌పీని మరింత బలోపేతం చేసేందుకు పరిషత్ సభ్యులు కృత నిశ్చయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మాతృశక్తి, దుర్గా వాహినీలను ఏర్పాటు చేయాలని సూచించారు. విశ్వహిందూ పరిషత్‌లో మహిళాశక్తిని జాగృతి పరచాలని పిలుపు నిచ్చారు. త్వరలో రాబోతున్న హిందూ నూతన సంవత్సరం, శ్రీరామ నవమి, హనుమాన్ జయంతిలను ఘనంగా జరపాలని అందుకు సభ్యులందరికీ ఏకం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ పశ్చిమ ప్రాంత సాధారణ కార్యదర్శి భక్త చరణ దాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యనారాయణ అనాపతి, ప్రాంత ఉపాధ్యక్షులు బాబా భోయి భజరంగబలి, జయపురం విభాగ కార్యదర్శి నవకృష్ణ రథ్, ప్రాంత ప్రచార, ప్రసారవిభాగ సభ్యులు సాధూ చరణ దాస్ చౌదరి, జయపురం జిల్లా ప్రచార విభాగ దుర్యోధన మాలిలతో పాటు నవరంగపూర్, మల్కన్‌గిరి ప్రాంతాల నుంచి వీహెచ్‌పీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కానరాని అభివృద్ధి



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ నాయకుడు తిరుపతి గోమాంగో

పర్లాకిమిడి: గ్రామాల్లో అభివృద్ధి కానరావడం లేదని సీపీఐ ఎంఎల్ నాయకులు అన్నారు. గజపతి జిల్లా నువాగడ బ్లాక్ అనుగురు పంచాయతీ పెట్టగుడ గ్రామంలో స్వాతంత్ర్యం వచ్చి నేటికి 76 సంవత్సరాలు గడిచినా అభివృద్ధ కానరాలేదని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు తిరుపతి గోమంగో అన్నారు. శుక్రవారం ఆయన పెట్టగుడ గ్రామంలో ఆదివాసీ సభ నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం వేతనదారులకు రోజుకు రూ.600 ఇవ్వాలని, జాబ్‌కార్డులు మంజూరు చేయాలని, పింఛన్ నెలకు రూ.5 వేలు, మంచి నీరు, విప్పపువ్వు మద్దతు ధర కిలో రూ.100, మొక్కజొన్న కిలోకి రూ.200 ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. అలాగే జయపూర్ మకిండి కెందునల్లా, అంబాఝురి, నువాసాహి వద్ద చెక్‌డ్యాంలు నిర్మించాలని డిమాండ్ చేశారు. పెట్టగుడ నుంచి కెడిపదర్, మాణిక్ పూర్, జయపూర్‌కు పక్కారోడ్లు నిర్మించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించక పోతే నువాగడ తహీల్దార్, బ్లాక్ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని తిరుపతి గోమాంగో అన్నారు. కార్యక్రమంలో కర్నియల్ గోమాంగో, మాధ్యూ రయితో, సైడ్రిక్ మల్లిక్, మయిజో మఝి, జయామఝి, జోహన్ రయితో, రాజేంద్ర మఝి పాల్గొన్నారు.

మహిళలపై పెరిగిన దాడులు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు గోవింద పాత్రో

మల్కన్‌గిరి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో మహిళలపై దాడులు చాలా ఘోరంగా పెరిగిపోయావని మల్కన్‌గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద పాత్రో ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలపై దాడులు పెరగడంతోపాటు రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పావన్నారు. పాఠశాలల్లో విద్యార్థినుల భద్రతను ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వ విఫల్యానికి నిరసనగా ఈ నెల 27వ తేదీన భువనేశ్వర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాసనసభను ముట్టడిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు జి. శ్రీనివాస్‌రావు , కోరాపుట్ మాజీ ఎమ్మెల్యే కృష్ణచంద్ర సోగాడియా, మాలమాడీ, పి.కేసురావు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఢిల్లేంద్ర(ఫైల్)

నందిగాం: మండలంలోని హరిదాసుపురం గ్రామానికి చెందిన అక్కురాడ ఢిల్లేంద్ర(35) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నందిగాం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కురాడ కరువులుకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు ఢిల్లేంద్ర జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న తమ్ముడు భుజంగరావును ష్యూరిటీగా పెట్టి భార్య సుశీల పేరిట రూ.3 లక్షల లోన్ తీసుకున్నాడు. కొద్ది రోజులుగా లోన్ డబ్బులు కట్టకపోవడంతో కుటుంబంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో భార్య సుశీల సారవకోట మండలం కుమ్మరిగుంటలో ఉన్న కన్నవారింటికి వెళ్లిపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఢిల్లేంద్ర శుక్రవారం ఉదయం టెక్కలి వెళ్లాడు. అటు నుంచి బస్సులో బెండిగేటు వరకు టికెట్ తీసుకొని తురకల కోట వద్ద దిగాడు. అక్కడినుంచి మాదిగాపురం సమీపంలో ఉన్న తమ జీడి తోటకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఘటనా స్థలంలో హిట్ దోమల కాయిల్స్, మద్యం బాటిల్ ఉండటంతో మందులో కాయిల్స్ కలిపి తాగి ఉరి వేసుకున్నట్లు తెలుస్తోంది. మృతుడి తమ్ముడు తోటలో జీడి పిక్కలు ఏరేందుకు వెళ్లగా అక్కడ చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు తెలియజేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై షేక్ మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని మోసగించిన యువకుడు అరెస్టు

జి.సిగడాం: యువతిని మోసగించిన కేసులో దేవరవలస గ్రామానికి చెందిన సిగటాపు కిరణ్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రణస్థలం సీఐ అవతారం తెలిపిన వివరాల ప్రకారం.. దేవరవలసకు చెందిన కిరణ్ అదే గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతిని పెళ్లి చేసుకుంటానని గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోవాలని బాధితురాలు కోరడంతో నిరాకరించాడు. పెద్దలను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధితురాలు ఈ నెల 19న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ వై.మధుసూదనరావు, ఏఎస్‌ఐ కె.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రేవులో గుర్తు తెలియని మృతదేహం

గార: మండలంలోని కళింగపట్నం పంచాయతీ సిలగాం జీడితోటల సమీపంలో ఇసుక రేవు(లంక భూములు)లో గుర్తుతెలియని మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఆర్.జనార్దన, పోలీసు సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుందని, ఇసుక గోతుల్లో కర్రపై మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. నీలం నిక్కరు, చిన్న గడులు ఉన్న షర్ట్‌తో మృతదేహం ఉందన్నారు. చేతిలో దుస్తులు, చెప్పులతో పాటు మూడు రోజుల కిందట ప్యాక్ చేసిన ఆహార పొట్లం ఉందని చెప్పారు. మృతదేహాన్ని పంచనామా కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన చిత్తిరి ఆర్య (21) శుక్రవారం రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్య వ్యక్తిగత పనిపై శుక్రవారం చీపురుపల్లిలో రైలు ఎక్కి ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ వెళ్లాడు. అక్కడి నుంచి జాజ్‌పూర్ వెళ్లేందుకు రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతుడి దగ్గరున్న ఆధార్ కార్డు, ఫోన్ సహాయంతో అక్కడి రైల్వే పోలీసులు విజయవాడలో ఉంటున్న తల్లిదండ్రులు బుజ్జి, మహాలక్ష్మిలకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన బుడితికి చెందిన కొందరితో కలిసి భువనేశ్వర్ బయల్దేరారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

ఆశ కార్యకర్తల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఆశ కార్యకర్తలు

మల్కన్‌గిరి : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు శుక్రవారం మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో జిల్లా ఆశ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆశ వర్కర్లకు నెలకు రూ. 18 వేలు వేతనం పెంచాలి, మరణించే కార్యకర్త కుటుంబానకి రూ. ఐదు లక్షలు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ సమయంలో పది లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు.

సేవా దృక్పథంతో ముందుకు సాగాలి



వేదికపై డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ దీపక్ తదితరులు

రాయగడ: వైద్య రంగంలో భాగమైన బీఫార్మా చదువును పూర్తి చేసుకున్న విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకు సాగాలని.. వారి భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని సెంచ్యూరియన్ విశ్వవిద్యాలయం బీ. ఫార్మా విభాగం అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్ పాత్రో అన్నారు. స్థానిక పితామహల్‌లోని సెంచ్యూరియన్ విశ్వవిద్యాలయంలోని బీ ఫార్మ చివరి సంవత్సరం చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు సభలో ప్రసంగించారు. వైద్య రంగంలో స్థిరపడాలన్న ఉద్దేశంతో ఇటువంటి కోర్సుల్లో ఆసక్తి కనబరిచి చదువుకునే విద్యార్థులకు ఎన్నో అవకాశాలు మెండుగా లభిస్తాయని అన్నారు. వాటిని సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ దీపక్ రౌత్, డాక్టర్ హరగౌరి మిశ్రా, డాక్టర్ కామిని శెఠి అన్నారు.

క్లుప్తంగా

జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే



సిబ్బంది సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖ సిబ్బంది సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి విజ్ఞాపనలు స్వీకరించి, పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని చెప్పారు.

ఆకట్టుకున్న గుర్రాల పరుగు ప్రదర్శన



పరుగు ప్రదర్శనలో దౌడు తీస్తున్న గుర్రం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థం సందర్భంగా నిర్వహించిన గుర్రాల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ పరుగు ప్రదర్శనలో 12 గుర్రాలు పాల్గొన్నాయి. వాటిలో రామన్న పాలెంకు చెందిన విక్రమ్ గుర్రం ప్రథమస్థానంలో నిలిచి రూ.12 వేలు, రెండోస్థానంలో చేనుల అగ్రహారానికి చెందిన మణి జెర్సీ నిలిచి రూ. పదివేలు సాధించాయి. మూడో స్థానంలో రామన్నపాలెంకు చెందిన చోడమాంబిక గుర్రం, నాల్గో స్థానంలో ఎల్.కోటకు చెందిన సింగపూర్ సత్యనారాయణ గుర్రం నిలిచి నగదు బహుమతులు సాధించాయి. విజేతలకు ఆలయ ధర్మకర్తలు, పెద్దలు కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

'గేట్' లో కార్తికేయ కుశల్ కుమార్‌కు 79వ ర్యాంక్



కార్తికేయ కుశల్‌కుమార్

విజయనగరం అర్బన్: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్-2025) ఫలితాల్లో పట్టణ విద్యార్థి గంట కార్తికేయ కుశల్ కుమార్ జాతీయ ర్యాంక్ 79 సాధించాడు. గేట్‌లోని ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ (ఈసీఈ) సబ్జెక్టులో 842 స్కోర్‌తో 79వ ర్యాంక్ తెచ్చుకున్నాడు. కార్తికేయ బీటెక్ కాలికట్ ఎన్ఐటీలో చదివాడు. మొదటి ప్రయత్నంలోనే మంచి ర్యాంక్ సాధించిన కార్తికేయ తండ్రి జి.సునీల్ కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా తల్లి శోభ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయిని.

పోక్సో కేసులో 12 ఏళ్ల జైలుశిక్ష

భామిని: మండలంలోని బిల్లుమడకు చెందిన మండల శివ అనే ముద్దాయికి పోక్సో కేసులో విచారణ అనంతరం శుక్రవారం 12 ఏళ్ల జైలు శిక్షను కోర్టు విధించినట్లు బత్తిలి ఎస్సై డి.అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2021లో బిల్లుమడ గ్రామంలో ఓ చిన్నారిపై మండల శివ అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా జిల్లా న్యాయమూర్తి విచారణ అనంతరంనేరారోపణ నిర్ధారించి శిక్ష విధించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సీతంపేట: మండలంలోని మానడుగూడ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొట్టుకోవడంతో ఎస్.గణపతి, మనోజ్‌లకు గాయాలు కాగా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించడంతో మెరుగైన వైద్యం కోసం గణపతిని రిమ్స్‌కు రాఫర్ చేసినట్లు ఏరియా ఆస్పత్రి ప్రధానవైద్యాధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు తమకు అందలేదని ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు.

అదృశ్యం కేసు నమోదు



నీలయ్య

పార్వతీపురం రూరల్: మండలంలోని అడ్డాపుశీల గ్రామానికి చెందిన నీలయ్య జనవరి 20 నుంచి ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై బి.సంతోషి తెలిపారు. బంధువులు, పరిచయస్తుల ఇళ్ల వద్ద భర్త ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందంటూ భార్య ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వివాహిత ఆత్మహత్య

పార్వతీపురం రూరల్: వివాహమైన ఏడాదికే అత్తవారింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై ఎస్సై బి.సంతోషి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బొడ్డవలస గ్రామానికి చెందిన నాదెళ్ల లీలాసత్య(36) అత్తవారింట్లో వరకట్నం వేధింపులు, అవమానాలు తాళలేక ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి నాదెళ్ల దుర్గారావు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు మృతురాలి భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.



భూగర్భజలమట్టాలను ఫిజియోమీటర్ల ద్వారా పరీక్ష చేస్తున్న అధికారులు



భూగర్భజల శాఖ కార్యాలయం

జలకలం..!

- అడుగంటిపోతున్న భూగర్భ జలాలు
- ఇప్పటికే మీటరు లోతుకు వెళ్లిన నీటిమట్టం
- రైతులకు జల సంరక్షణపై అవగాహన
- నేడు ప్రపంచ జల దినోత్సవం

విజయనగరం టౌన్: వేసవి ప్రారంభమైంది. జిల్లాలో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. నీటి వనరులు ప్రస్తుతం అవసరం మేరకు లభ్యమవుతున్నప్పటికీ వాతావరణంలో వచ్చే మార్పుల ప్రభావం, రైతులు, ప్రజలకు భూగర్భజలాలను సంరక్షించుకోవడంలో సరైన అవగాహన లేకపోవడంతో జల లభ్యతలో తగ్గుదల కనిపిస్తోంది. ఫిబ్రవరి, మార్చి నెల మధ్య ఏకంగా మీటరు లోతున నీటి మట్టం తగ్గిపోయినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నీటిమట్టం ప్రస్తుతానికి అధికారిక లెక్కల ప్రకారం బాగానే ఉన్నప్పటికీ నెలరోజుల వ్యవధిలోనే మీటరు లోతున తగ్గిపోవడంతో హెచ్చరికలు ప్రారంభమయ్యాయనే చెప్పవచ్చు. రానున్న ఏప్రిల్, మే, జూన్ నెల నాటికి మరింతగా ప్రమాద ఘంటికలు మోగనున్నాయనడంలో సందేహం లేదు. ఏదైమైనప్పటికీ రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలంటే అవగాహన కార్యక్రమాలు తప్పనిసరి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని సాక్షి ప్రత్యేక కథనం.

జిల్లాలో ఈ ఏడాది జనవరి నెలలో భూమట్టానికి 3.50మీటర్ల వరకూ ఉండే నీటిమట్టం, ఫిబ్రవరి నాటికి 4.53కి పడిపోయింది. జిల్లాలోని గుర్ల, గజపతినగరం, రామభద్రపురం, జామి, రాజాం, సంతకవిటి, గంట్యాడ, నెల్లిమర్ల, పూసపాటిరేగ, రేగిడిఆమదాలవలస మండలాల్లో మూడు మీటర్ల వరకూ ప్రస్తుతానికి నీటిమట్టాలు బాగానే ఉన్నాయి. ఇక తెర్లాం, వంగర, డెంకాడ, ఎస్.కోట, చీపురుపల్లి, మెరకముడిదాం, మెంటాడ, దత్తిరాజేరు, కొత్తవలస, ఎల్.కోట, భోగాపురం, వేపాడ, విజయనగరం, బాడంగి, బొబ్బిలి, బొండపల్లి మండలాల్లో 3 నుంచి 8 మీటర్ల వరకూ నీటిమట్టాలు ఉన్నాయి. 8 నుంచి 20 మీటర్ల ప్రమాదస్థాయిలో గరివిడి మండలంలో నీటిమట్లాలు ఉన్నాయి. భూగర్భ జల మట్టాలను కొలిచే ఫిజియోమీటర్లు జిల్లాలో 50 వరకూ ఉన్నాయి. వాటి ద్వారా భూగర్భజల శాఖ అధికారులు నీటిమట్టపు కొలతను సేకరిస్తుంటారు. తద్వారా భూగర్భ స్థితిగతులను అంచనా వేసి ,జిల్లా ప్రజలకు జల స్థితిగతులపై అవగాహన కల్పిస్తారు. నీటి సంరక్షణకు తగిన సాంకేతిక సలహాలిస్తుంటారు. ప్రధానంగా రైతులు రాబోయే వర్షాకాలంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టి ఫారం పాండ్స్ ఏర్పాటు చేసుకోవడంపైన, వర్షపు నీరు వృథాగా పోకుండా చిన్నపాటి గట్లు నిర్మించే విధంగా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

జల సంరక్షణకు చర్యలు



ప్రస్తుతం భూగర్భ జలాలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని జిల్లా ప్రజలు జలసంక్షణ చర్యలు చేపట్టాలి. వాన నీటిని సంరక్షించుకోవాలి. భూగర్భజలాలను పెంచుకునేందుకు రీచార్జ్ స్ట్రక్చర్స్‌ను నిర్మించుకోవాలి. భావితరాలకు నీటిఎద్దడి లేకుండా చూడాల్సిన అవసరం మనందరిపైనా ఉంది.

– ఎస్‌వీకె.దుర్గాప్రసాద్, జిల్లా భూ గర్భజల శాఖ అధికారి, విజయనగరం

రైల్వే ఉద్యోగుల నిరసన



మాట్లాడుతున్న డివిజనల్ కో ఆర్డినేటర్ పీవీ.మౌళీశ్వరరావు

విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వేశ్రామిక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో ఉద్యోగులు, యూనియన్ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ కోఆర్డినేటర్ పీవీ.మౌళీశ్వరరావు మాట్లాడుతూ పెరిగిన ట్రాఫిక్ కారణంగా అన్ని ఎల్‌సీ గేట్లకు 8 గంటల రోస్టర్‌ను అమలుచేయాలన్నారు. ట్రాక్ మెయింటైనర్లకు సైకిల్ అలవెన్స్‌చెల్లింపును నిర్ధారించాలని, రన్ఓవర్ కేసుల్లో స్టేషన్ మాస్టర్లకు మెమోలు ఇచ్చే ట్రాక్ మెయింటైనర్లను నివారించాలని బదులుగా సీయూజీ ఫోన్‌ల ద్వారా సంబంధిత కీమాన్, ట్రాక్ మాన్‌ల నుంచి వివరాలను పొందడంపై పీడబ్ల్యూవే సూపర్ వైజర్‌ల ద్వారా మెమోలను అందించేందుకు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఆక్యుపెన్సీని పెంచేందుకు క్వార్టర్స్ మెరుగైన నిర్వహణ చేపట్టాలని కోరారు. సేఫ్టీ కేటగిరీలో పనిచేస్తున్న ఉద్యోగులకు రిస్క్, హార్డ్‌షిప్ అలవెన్స్ అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రామిక్ కాంగ్రెస్ విజయనగరం బ్రాంచ్ కార్యదర్శి బి.సత్యనారాయణ, శ్రీకాకుళం బ్రాంచ్ కార్యదర్శి ఎస్.దంతేశ్వరరావు, సెంట్రల్ ఆఫీస్ బేరర్ ఎం.అనిల్ కుమార్, బి.శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

మండాకురిటిలో చోరీ

- 5.50తులాల బంగారం, నగదు అపహరణ
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో భారీ చోరీ జరిగి 5.50తులాల బంగారం, కొంత నగదు అపహరణకు గురైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనపై ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దేవిరెడ్డి సన్యాసిరావు అనారోగ్యం కారణంగా మంగళవారం ఆస్పత్రికి వెళ్లి అక్కడినుంచి పెద్ద కుమార్తె ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఇంటికి చేరడంతో ఇంటి తాళం కోసి ఉండడం, ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంటిలో సామగ్రి అంతా చిందర వందరగా పడి ఉండడం గమనించి, బీరువా తెరిచి చూడగా అందులో ఉంచిన 5.50 తులాల బంగారం, కొంత నగదు మాయమయ్యాయి. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్‌టీమ్ వచ్చి ఆధారాలు సేకరించింది. దేవిరెడ్డి అప్పలనరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం




ఆలవెల్లి రాజా (ఫైల్)

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు వద్ద శుక్రవారం ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు స్థానిక ఎస్సై పి.రమేష్ నాయుడు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. తోటపల్లి ప్రాజెక్టు నాల్గవ గేటు వద్ద యువకుడి మృతదేహం తేలియాడుతూ ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని బయటకు తీసిన తరువాత మృతుడిని పార్వతీపురం పట్టణంలో గల జగన్నాథపురం ప్రాంతానికి చెందిన ఆలవెల్లి రాజా(26)గా గుర్తించారు. ఈనెల 19 బుధవారం ఉదయం నుంచి కుమారుడు ఆలవెల్లి రాజా ఆచూకీ లేకపోవడంతో తండ్రి శ్రీనివాసరావు పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేయగా శుక్రవారం తోటపల్లి జలాశయం వద్ద రాజా మృతదేహం లభ్యమైంది. మృతికి గల కారణాలు తెలియకపోవడంతో అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

25న పాలకొండలో జాబ్‌మేళా

పార్వతీపురంటౌన్: ఈ నెల 25న పాలకొండలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఎనీ డిగ్రీ చదివి 18 నిండి 29 సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు జాబ్‌మేళాకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి శ్రీ సత్యసాయి డిగ్రీ కాలేజీ, పాలకొండలో సంకల్ప్ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ జాబ్ మేళాకు 15 కంపెనీల ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీల్లోకి ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులకు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్//నైపుణ్యం .ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెస్యూమె, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్,1 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో జాబ్‌మేళా జరిగే ప్రదేశంలో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 6301275511, 7993795796 నంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



బిడ్డిక వెంకటి మృతదేహం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని రావాడ రామభద్రపురం గ్రామానికి చెందిన బిడ్డిక వెంకటి (55) పాముకాటుతో శుక్రవారం మృతిచెందాడు. సాయంత్రం 6 గంటల సమయంలో పొలం పనులు ముగించుకుని వస్తుండగా మార్గమధ్యంలో నాగుపాము కాటువేసింది. ఈ విషయాన్ని కుటుంబీకులకు తెలియజేసి, రావాడ రామభద్రపురం పీహెచ్‌సీలో చేరాడు. అక్కడి వైద్యులు ప్రాథమిక వైద్యసేవలు అందించి మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ మేరకు 108లో పార్వతీపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకటి మృతిచెందాడు. అయినప్పటికీ కుటుంబసభ్యులు సమీపంలోని చినమేరంగి సీహెచ్‌సీకి తీసుకెళ్లగా వెంకటి మృతిచెందినట్లు అక్కడి వైద్యురాలు పూర్ణ చంద్రిక ధ్రువీకరించారు.

వేతనదారులకు నిలువనీడ కరువు

- పనిప్రదేశంలో మెడికల్ కిట్లు లేవు
- మండుటెండలోనే పనులు
- 8 వారాలుగా వేతనాలు అందక విలవిల



కుడ్డపల్లి ఉపాధి పనుల్లో నిలువనీడ లేకుండా పనులు చేస్తున్న వేతనదారులు

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట మండలం ఎంఎస్ఆర్ఈజీఎస్ పనులు చేయడంలో ముందంజలో గత కొన్నేళ్లుగా ఉంది. ఈ మండలంలో ఎక్కువ పనులు జరుగుతాయి. అటువంటి ఈ మండలంలో ఉపాధి వేతనదారులకు నిలువ నీడ లేదు. మండుటెండలో విలవిల్లాడుతున్నారు. వేసవి వచ్చినా కనీసం టెంట్లు కూడా లేకపోవడంతో వేతనదారులకు అవస్థలు తప్పడం లేదు. అసలే వేసవి కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపాధి పనులు చేస్తుంటారు. ఆ సమయంలో అత్యధికంగా ఎండ కాస్తోంది. ఉదయం 8 గంటలైతే భానుడు భగభగ మంటున్నాడు. సాయంత్రం 5 గంటల వరకు ఎండలు మండుతున్నాయి. విశ్రాంతి తీసుకోవడానికి కనీసం నీడ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వేతనదారులు వాపోతున్నారు. అలాగే పని సమయంలో వడదెబ్బ వంటివి, చిన్నచిన్నదెబ్బలు తగులుతుంటాయి. ఈ సమయంలో ప్రాథమిక చికిత్స చేయడానికి మెడికల్ కిట్లు పని ప్రదేశం వద్ద ఉండాలి. వాటిని కూడా ప్రభుత్వం ఇంతవరకు సప్లై చేయకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు వాపోతున్నారు. వేతనదారులు డీహైడ్రేషన్‌కు గురైతే ఓఆర్ఎస్ ప్యాకెట్ కూడా లేని పరిస్థితి ఉంది.

బకాయిలు రూ.5 కోట్లకు పైనే..

వేతనదారులకు చెల్లించాల్సిన వేతనాల బకాయిలు రూ.కోటి వరకు ఉండవచ్చని అంచనా. మెటీరియల్ కాంపొనెంట్‌లో వేసిన రహదారులు, హార్టీకల్చర్, ఇతర పనులు దాదాపు 200 వరకు జరగడంతో వాటికి చెల్లించాల్సిన బకాయిలు రూ.4 కోట్ల వరకు ఉండవచ్చని సమాచారం. వేతనదారులు చేసిన భూ అభివృద్ధి పనులు వంటి వాటికి ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించాల్సి ఉంది. దాదాపు ఉపాధి వేతనదారులు జాబ్‌కార్డులు ఉన్నవారు 18 వేల మంది ఉన్నారు. వారిలో వంద రోజుల పనులు పూర్తి చేసిన వారు 80 శాతం వరకు ఉండడంతో ప్రస్తుతం పనులు చేస్తున్న వేతనదారులు 3 వేలమంది ఉన్నారు. భూ అభివృద్ధి, ట్రెంచింగ్, ఫార్మ్‌పాండ్ పనులు వేతనదారులు చేస్తున్నారు. ఇలా 150 వరకు పనులు చేశారు. సరాసరి ఒక్కో వేతనదారుకు రోజుకు రూ.270 వరకు వేతనం గిట్టుబాటవుతుంది. రెండు నెలలుగా బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని వేతనదారులు ఆవేదన చెందుతున్నారు.



పెద్దూరులో పనులు చేస్తున్న వేతనదారులు

కొలతలకు టేప్ సప్లై లేదు..

ఉపాధి పనులు చేసిన వేతనదారుల పనులు ఎంత పూర్తి చేశారనేది సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ ఇతర సిబ్బంది కొలతలు వేయడానికి వీలుగా టేపులు సప్లై చేయాల్సి ఉన్నప్పటికీ అవికూడా సరఫరా చేయని పరిస్థితి ఉంది. కేవలం ఎవరి సామగ్రి వారు తెచ్చుకునే పనుల కొలతలు వేస్తున్నారు.

టెంట్లు తాత్కాలికంగా వేసుకోమన్నాం

వేతనదారులు పనిచేసిన చోట టెంట్లు తాత్కాలికంగా వేసుకుంటున్నారు. ఎండ తీవ్రత లేని సమయంలో ఉదయం 7 నుంచి 11 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు పనులు చేసుకుంటున్నారు. బకాయి నిధులు మంజూరైన వెంటనే వేతనదారులకు వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటాం.

శ్రీహరి, ఏపీడీ, ఎంఎస్ఆర్ఈజీఎస్

ఫెన్సింగ్ పోటీల్లో కానిస్టేబుల్‌కు కాంస్యం

- అభినందించిన ఎస్పీ వకుల్ జిందల్



ట్రాఫిక్ కానిస్టేబుల్ మూర్తిని అభినందిస్తున్న ఎస్పీ వకుల్, పక్కనే సీఐ సూరినాయుడు, ఏఆర్ ఇన్‌స్పెక్టర్ గోపాలనాయుడు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో జరిగిన 1వ ఆలిండియా పోలీస్ క్లస్టర్ పోటీల్లో కాంస్యపతకం సాధించిన పీసీ బీఎస్ ఎన్ మూర్తికి ఎస్పీ వకుల్ జిందల్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని ట్రాఫిక్ సీఐ సూరినాయుడుతో పాటు కానిస్టేబుల్ మూర్తి శుక్రవారం కలిశారు. జిల్లాకు చెందిన బీఎస్ఎన్ మూర్తి పోలీస్ శాఖ నిర్వహించిన జాతీయపోటీల్లో ఫెన్సింగ్ విభాగంలో రాష్ట్ర పోలీసు జట్టు తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించాడు. కాంస్య పతకం సాధించిన కానిస్టేబల్ మూర్తిని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అభినందించారని ఎస్పీ వకుల్ జిందల్ ఈ సందర్భంగా తెలిపారు. పతకాలు సాధించిన పోలీస్‌సిబ్బందికి త్వరలో ప్రోత్సాహక నగదు బహుమతిని, అదనంగా వార్షిక ఇంక్రిమెంట్ అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.గోపాల నాయుడు, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు



జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. తిరుపతి నాయుడు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. శుక్రవారం జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 10,363 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 10,314 మంది హాజరయ్యారని, 49 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష సజావుగా నిర్వహించామన్నారు. 61 పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షక బృందం 6 కేంద్రాల్లో తాను సందర్శించినట్లు తెలిపారు.

ఇంటర్ వర్సిటీ బేస్‌బాల్ పోటీలకు పట్టణ క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న మాన్సాస్ కరెస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్ రాజు

విజయనగరం అర్బన్: నెల్లూరులోని విక్రమ్ సింహపురి యూనివర్సిటీలో త్వరలో జరగనున్న ఇంటర్ యూనివర్సిటీ బేస్‌బాల్ పోటీలకు ఆంధ్రయూనివర్సిటీ నుంచి పోటీ పడే జట్టులో విజయనగరం పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాల క్రీడాకారులు ముగ్గురు ఎంపికయ్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈ నెల 19న జరిగిన అంతర్ కళాశాల బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభచూపిన ఎం.దుర్గాప్రసాద్, ఐ.నవీన్ కుమార్, ఎస్.భవానీప్రసాద్ ఎంపికైన తుదిజట్టులో ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిని మాన్సాస్ కరెస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్‌రాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాంబశివరావు, పీడీ డాక్టర్ పి.రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

రత్నం ఫార్మాస్యుటికల్స్‌పై క్రిమినల్ కేసు

- కాలం చెల్లిన మందులు, నిషేధిత మత్తు సిరప్‌లు లభ్యం



వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని అంబటి సత్రం జంక్షన్‌లో ఉన్న రత్నం ఫార్మాస్యుటికల్స్‌పై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ దుకాణంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి తనిఖీలు చేపట్టగా గడువుదాటిన మందులు, నిషేధిత మత్తు టానిక్‌లు దుకాణంలో లభ్యమయ్యాయి. దీంతో ఈ దుకాణంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకుని యువత జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. వెంకటరత్నం మెడికల్ దుకాణంలో అధిక మొత్తంలో మత్తు కలిగించే నిషేధిత టానిక్‌లు పట్టుకుని సీజ్ చేశామన్నారు. తనిఖీల్లో ఔషధ నియంత్రణశాఖ ఎ.డి రజిత పాల్గొన్నారు.

నెలాఖరుకు పథకాల మంజూరు



ప్రణాళిక నోట్స్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

- కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్:

బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు ఈ నెలాఖరులోగా పథకాలను మంజూరు చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. వివిధ పథకాలు, వాటి మంజూరులో బ్యాంకుల పరిస్థితిని ఎల్‌డీఎం వీవీరామణమూర్తి వివరించారు. నాబార్డ్ డీడీఎం నాగార్జున మాట్లాడుతూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాబార్డ్ పొటెన్షియల్ లింక్‌డ్ క్రెడిట్ ప్లాన్ (పీఎల్‌సీపీ)ను వివరించారు. సుమారు రూ.10,650.32 కోట్ల అంచనాతో ఈ రుణ ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. దీని ఆధారంగానే జిల్లా వార్షిక రుణ ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ ప్రణాళికను కలెక్టర్, ఇతర అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, వ్యవసాయ శాఖ జేడీ వీటీరామారావు, పశుసంవర్ధకశాఖ డాక్టర్ వైవీరమణ, జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ, మెప్మా పీడీ చిట్టిరాజు, ఉద్యాన, మత్స్య శాఖల డీడీలు జమదగ్ని, నిర్మలాకుమారి, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ ఈడీలు వెంకటేశ్వరరావు, పెంటోజీరావు, వివిధ బ్యాంకుల అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాడి ప్రకాష్‌కి పతంజలి పురస్కారం



విజయనగరం గంటస్తంభం:

ప్రముఖ పాత్రికేయుడు, సినీ మాటల రచయిత కె.ఎన్.వై.పతంజలి 73వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన పాత్రికేయుడు, పతంజలితో పాతికేళ్ల పాటు కలిసి పనిచేసిన రచయిత తాడి ప్రకాష్‌కు పతంజలి పురస్కారం అందజేయనున్నట్లు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. గురజాడ అప్పారావు గృహంలో వేదిక ప్రతినిధులతో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

ఏటా పతంజలి జయంతి సందర్భంగా ప్రముఖులకు పురస్కారం అందజేస్తున్నామన్నారు. 2025 సంవత్సరానికి గాను తాడి ప్రకాష్‌కు ఈ నెల 29 తేదీన గురుజాడ గ్రంథాలయంలో పురస్కారం ప్రదానం చేస్తామని చెప్పారు. సాహిత్య అభిమానులు, రచయితలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వేదిక కార్యదర్శి బాబు, లక్ష్మణరావు, పౌరవేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.